నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

శనివారం 6 జనవరి 2024
SATURDAY, JANUARY 6, 2024 | RANGAREDDY | పేజీలు PAGES : 8




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

# హ్యాట్రిక్‌కు వ్యూహం

### చేవెళ్ల ఎంపీ స్థానాన్ని దక్కించుకునేలా పావులు కదుపుతున్న బీఆర్‌ఎస్ పార్టీ

- తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- పాల్గొన్న బీఆర్‌ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కే.కేశవరావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులు
- హాజరైన ఏడు నియోజకవర్గాల పరిధిలోని తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, గులాబీ శ్రేణులు

7

లోక్ సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ పార్టీ వ్యూహ రచన చేస్తున్నది. చేవెళ్ల ఎంపీ స్థానాన్ని మూడోసారి దక్కించుకోవాలన్న లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నది. గత డిసెంబర్ చివరి వారంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక దఫా సమావేశాన్ని నిర్వహించగా, శుక్రవారం మరోసారి చేవెళ్ల ఎంపీ స్థానంపై తెలంగాణ భవన్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. గెలుపు దిశగా అడుగులు వేయాలని గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. చేవెళ్ల ఎంపీ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే విజయం సాధించారు. బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఓట్లు ఉండడంతో మరోసారి గెలిచే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కే.కేశవరావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొనగా, ఏడు నియోజకవర్గాల పరిధిలోని తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, గులాబీ శ్రేణులు హాజరయ్యారు.

– రంగారెడ్డి, జనవరి 5(నమస్తే తెలంగాణ)




## అవిశ్వాస అస్త్రం..

# ‘ఆర్థిక’ లక్ష్యం!

- ఇదే అదునుగా భావిస్తున్న కార్పొరేటర్లు, కౌన్సిలర్లు
- మిగిలిన ఏడాదిలో వచ్చే పనులూ ఏమీ లేవనే భావన
- కొన్నిచోట్ల రాజకీయ కారణాలు, మరికొన్ని చోట్ల ఆర్థిక కోణాలు..!

సెంటర్ స్ప్రెడ్‌లో..

నగర శివారుల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు తెరపైకి వస్తున్నాయి. మారిన రాజకీయ పరిణామాలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను మేయర్లు, చైర్మన్లు పట్టించుకోకపోవడం, పాలక మండలి గడువు మరో ఏడాదితో ముగియనుండడం వంటివి కారణమవుతున్నాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పటికిప్పుడు పెద్దగా నిధులుగానీ, పనులుగానీ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఇదే అదునుగా భావిస్తూ ఉన్న ఈ ఏడాదిలోనే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్లుగా కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఆర్థిక కోణంలో ఆలోచిస్తున్నట్టు వారి సన్నిహితుల దగ్గర అభిప్రాయపడుతున్నారు. కొన్ని చోట్ల రాజకీయ పరిణామాలూ అవిశ్వాసానికి కారణమవుతున్నాయి. ఇప్పటికే బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. తాజాగా ఆదిబట్ల మున్సిపాలిటీలో ఏకంగా అవిశ్వాస తీర్మానాన్ని శుక్రవారం అందించగా, రంగారెడ్డి కలెక్టర్‌కు చేరింది.

– సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 5 (నమస్తే తెలంగాణ)/ ఆదిబట్ల



# ‘ఉపాధి’లో మూడో స్థానం

### కూలీలకు పని కల్పించడంలో వికారాబాద్ జిల్లా ముందంజ

- 54,95,230 పనిదినాలకుగాను 48,66,752 పని దినాల కల్పన
- రూ.90.45కోట్లు కూలీలకు చెల్లింపు
- పని లేక దిగులుచెందుతున్న కూలీలు
- జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాల అనుసంధానం
- కూలీలకు శాపంగా మారిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- కొత్త నిబంధన అమల్లోకి వస్తే మరిన్ని ఇబ్బందులు

8

ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా మూడో స్థానంలో నిలిచింది. పనిదినాలు కల్పించడంలో జిల్లా ముందంజలో నిలిచినా పూర్తిస్థాయిలో జాబ్‌కార్డు ఉన్న కూలీలందరికీ జిల్లా యంత్రాంగం పని కల్పించలేకపోయింది. గత డిసెంబర్ నెలాఖరు వరకు 54,95,230 పనిదినాలు కల్పించాల్సి ఉండగా, 48,66,752(89శాతం) పనిదినాలను మాత్రమే కల్పించారు. ఇప్పటివరకు కూలీలకు రూ.90.45 కోట్లను చెల్లించారు. ఈ యాసంగి సీజన్‌లో వ్యవసాయ పనులు అంతగా ఉండవు కాబట్టి, పని లేక కూలీలు దిగులుచెందుతున్నారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు శాపంగా మారుతున్నాయి. జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేయడంతో కూలీలకు ఇబ్బందిగా మారింది. మరోవైపు ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు పని ఫొటోలను అప్‌లోడ్ చేయాలనడం ఇబ్బందికరంగా తయారైంది. కేంద్రం పెట్టే కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నది. జిల్లాలో 1,82,794 జాబ్ కార్డులు ఉండగా, 3,76,101 మంది కూలీలు ఉన్నారు.

– పరిగి, జనవరి 5



రోడ్డు పక్కన మొక్కలు నాటే పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కృష్ణన్

## నేటి నుంచి

# ఇస్తేమా..

పరిగి శివారులోని న్యామత్‌నగర్‌లో ఏర్పాట్లు

- రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి హాజరుకానున్న ముస్లింలు
- 2 నుంచి 3లక్షల మంది వరకు వచ్చే అవకాశం
- ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

పరిగి, జనవరి 5 : పరిగి పట్టణ శివారులోని న్యామత్‌నగర్ పరిధిలో నేటి నుంచి ఇస్తేమా ప్రారంభమై ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటకలోని గుల్బర్గా, బీదర్ తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు పాల్గొననుండగా, కొందరు శుక్రవారం చేరుకున్నారు. ఇస్తేమా నిర్వహణకు ప్రభుత్వం రూ.2.45 కోట్లు మంజూరు చేసింది. నీటి వసతి కోసం కాళ్లాపూర్ నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ వేయించి మిషన్ భగీరథ నీటిని సంపులోకి వదులుతున్నారు. ఇతర అవసరాల కోసం ప్రత్యేకంగా పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయించారు. భోజన వసతి కోసం 26 వంటశాలలతో పాటు 6 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించారు. ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షణలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలతోపాటు మొత్తం 500 మందితో పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్నారు. ఇతర ఏర్పాట్లను కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. నాలుగుచోట్ల వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని ఏర్పాటు చేశారు.



ముస్లింలు కూర్చునేందుకు చేసిన ఏర్పాట్లు